



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 13-08-2024 సంపుటి : 06 సంచిక : 324 పేజీలు : 8 వెల : రూ 3-00



# విశాఖలో ఎమ్మెల్సీ ఎన్నికల హీట్

## వైసీపీ నుంచి బరిలోకి బొత్స..
## నేడు కూటమి అభ్యర్థిపై క్లారిటీ..


విశాఖపట్నం ఆగష్టు 12(( విభారె) :విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పొలిటికల్‌గా హీట్ పెంచుతోంది. ఎన్నికకు సమయం దగ్గర పడేకొద్దీ.. అధికార ప్రతిపక్ష పార్టీలు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించిన వైసీపీ? విజయం కోసం పక్కాగా ప్లాన్ చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ సిట్టింగ్ సీటు చేజారనివ్వొద్దని భావిస్తున్నారు జగన్. విశాఖ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ప్రలోభాలు లొంగిపోవద్దని.. బెదిరింపులకు భయపడొద్దని నేతలకు సూచించారు. వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ కూడా ప్రచారంలో బిజీగా గడుపుతున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట ప్రాంతాల్లో పర్యటించి పార్టీ కేడర్‌తో వరుస సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. ఇప్పటికే తమ నేతలను వైసీపీ బెంగళూరు క్యాంప్‌కు తరలించింది. ఆగస్టు 12న వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స నామినేషన్ దాఖలు చేసినారు ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని మాజీమంత్రి ధీమాగా ఉన్నారు.

**నేడు కూటమి అభ్యర్థిపై క్లారిటీ.. :** ఓ వైపు ఎన్నికల్లో గెలుపు కోసం వైసీపీ ప్రయత్నాలు చేస్తుంటే.. కూటమి పార్టీల వ్యూహం ఏమిటో అంతుచిక్కడం లేదు. ఇటీవల విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. అయితే భేటీలో అభ్యర్థి ఎంపికపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే దీనిపై జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఎవరనేది సోమవారం ప్రకటించే అవకాశం ఉందని వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున బరిలో నిలిచే అభ్యర్థిని ఎవరనే దానిపై త్వరలోనే క్లారిటీ వస్తుందన్నారు. భారీ మెజార్టీతో కూటమి గెలిపించి తీరుతామన్నారు. ఎవరు ఎన్ని క్యాంపులు పెట్టినా.. ఓట్లు మాత్రం తమకే పడతాయన్నారు.

**నామినేషన్‌కు ఇంకా ఒక్క రోజే గడువు :** విశాఖ ఎమ్మెల్సీ స్థానానికి ఆగస్టు 13తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. నామినేషన్‌కు ఇంకా ఒక్క రోజు మాత్రమే గడువు ఉండటంతో.. కూటమి అభ్యర్థి బరిలోకి దిగుతారా ? లేదా అనే ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకవేళ కూటమి తరపున అభ్యర్థి బరిలోకి దిగితే.. విశాఖ తీరంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక రాజకీయం మరింత రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# పూజా ఖేద్కర్‌ను అరెస్టు చేయకండి: ఢిల్లీ హైకోర్టు




న్యూఢిల్లీ: ఆగష్టు 12( విభారె) వివాదాస్పద ఐఏఎస్ ఆఫీసర్ పూజా ఖేద్కర్‌ను అరెస్టు చేయవద్దు అంటూ ఇవాళ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఢిల్లీ పోలీసులతో పాటు యూపీఎస్సీకి ఆ నోటీసులు జారీ చేసింది. ముందస్తు బెయిల్ కావాలంటూ పూజా ఖేద్కర్ పిటీషన్ పెట్టుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్న కారణంగా.. ఆమెను అరస్టు చేయరాదు అని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో అత్యవసర అరెస్టు అవసరం లేదని కోర్టు చెప్పింది. అయితే ఆగస్టు 21వ తేదీ వరకు ఆమెకు రక్షణ కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చింది. అక్రమ రీతిలో ఓబీసీ, దివ్యాంగ కోటాను వాడుకున్నట్లు పూజా ఖేద్కర్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీ పోలీసులు, యూపీఎస్సీకి జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ నోటీసులు ఇచ్చారు. వచ్చే విచారణ తేదీ వరకు తమ క్లయింట్‌ను అరెస్టు చేయరాదు అని జస్టిస్ ప్రసాద్ తెలిపారు. ఆగస్టు 21వ తేదీన మళ్లీ ఈ కేసులో వాదనలు జరగనున్నాయి. రిజర్వేషన్ బెనిఫిట్ పొందేందుకు యూపీఎస్సీ సివిల్స్ పరీక్ష దరఖాస్తులో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు ఖేద్కర్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఖేద్కర్ అభ్యర్థిత్వాన్ని జూలై 31వ తేదీన యూపీఎస్సీ రద్దు చేసింది. భవిష్యత్తులో పరీక్షలు రాయకుండా నిషేధించింది.

# హైవేలు ఉన్నది ట్రాక్టర్ల పార్కింగ్ కోసం కాదు.. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు..!



న్యూఢిల్లీ: ఆగష్టు 12( విభారె) శంభు సరిహద్దును పాక్షికంగా తెరవడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిహద్దులను తెరవాలని ఆదేశించింది. ఈ విషయంలో పంజాబ్, హర్యానా డీజీపీలు వారంలోగా సమావేశం నిర్వహించి.. సమస్యకు పరిష్కారం చూపాలని చెప్పింది. వాస్తవానికి గత కొంతకాలంగా ఎంఎస్‌పీ చట్టం డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైతులు ఢిల్లీకి వెళ్లేందుకు యత్నించగా.. హర్యానా ప్రభుత్వం రైతులను శంభు సరిహద్దులో బారికేడ్లు ఏర్పాటు చేసి అందుకున్నది. అప్పటి నుంచి రైతులు అక్కడే బైఠాయించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. శంభు సరిహద్దులో ఒక లైన్ సాధారణ ప్రయాణికుల కోసం తెరవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. పాటియాలా, అంబాల జిల్లాల ఎస్పీలతో వారంలోగా సమావేశం కావాలని హర్యానా, పంజాబ్ డీజీపీలను కోర్టు ఆదేశించింది. ట్రాక్టర్లను రోడ్డుపై నుంచి తొలగించేందుకు రైతులను ఒప్పించాలని హర్యానా సర్కారుకు సూచించింది. న్యాయమూర్తులుజస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పంజాబ్, హర్యానా ప్రభుత్వాలు రాజకీయేతర వ్యక్తులతో కమిటీని ఏర్పాటు చేసి రైతులతో సమావేశాలను నిర్వహించడంపై సుప్రీంకోర్టు అభినందించింది. హైవేలు ఉన్నది ట్రాక్టర్ల పార్కింగ్ కోసం కాదని ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. అంబులెన్స్‌లు, అవసరమైన సేవలు, సీనియర్ సిటిజన్లు, మహిళలు, బాలిక విద్యార్థులు, సమీప ప్రాంతాల స్థానిక ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడానికి శంభు వద్ద రహదారిని పాక్షికంగా తెరవడం అవసరమని పేర్కొన్నది. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరకు సంబంధించి చట్టాన్ని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 13 నుంచి రైతులు నిరసన తెలుపుతున్నారు. శంభు సరిహద్దుల్లోని బారికేడ్లను వారంలోగా తొలగించాలని పంజాబ్, హర్యానా హైకోర్టు ఆదేశం చడాన్ని సవాల్ చేస్తూ హర్యానా ప్రభు త్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై సర్వో న్నత న్యాయ స్థానం ఈ పిటిషన్‌పై విచారణ జరిపి ంది. ఫిబ్రవరిలో అం బాలా-న్యూఢిల్లీ జాతీయ రహదారిపై సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్). కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు ఢిల్లీకి కవాతు నిర్వహించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# సెక్యూరిటీ లేకపోతే ప్రజలు తిరగబడతారని భయపడుతున్నాడేమో..



విజయవాడ, ఆగస్టు 12,ఆగష్టు 12( విభారె) మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రతను ఎవరూ తొలగించలేదని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. జగన్ అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.

## జగన్‌పై హోంమంత్రి అనిత సెటైర్లు

సెక్యూరిటీ లేకపోతే ప్రజలు తిరగబడతారని భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. రూల్స్ ప్రకారం మాజీ ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన భద్రత కల్పించామని చెప్పా రు.రాష్ట్రంలో 20వేల మంది పోలీసుల కొరత ఉ ంటే ఆయనకు 900 మందిసెక్యూరి టీకావాలా అని మండిపడ్డారు.రాజమండ్రి సెంట్రల్ జైలును హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం పరిశీలించారు. జైలు ఆధ్వర్యంలో పెట్రోలు బంక్‌ను ప్రారంభించిన అనంతరం.. సెంట్రల్ జైలులోఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్నేహ బ్లాక్ వద్దకు వెళ్లాక హోం మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును జైలుకు పంపించడాన్ని ఆమె గుర్తుకుతెచ్చుకున్నారు తమనాయకుడిని53 రోజులు అన్యాయంగా జైల్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుకొవచ్చి బాధగా అనిపిస్తుందని అన్నారు. వైసీపీ పాలనలో అక్రమ కేసులకు చంద్రబాబు కూడా బాధితుడిగా మారారని పేర్కొన్నాం. అక్ర మ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలు వలు పాతాళానికి పడిపోయాయని తెలి పారు.వాళ్లపాపాల ండాయని.. అందుకే జన నాయకుడిని బాధపెట్టిన వైసీపీని పాతాళానికి తొక్కేలా ప్రజలు బలమైన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు.రా నున్న రోజుల్లో సెంట్రల్ జైలులో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని వంగలపూడి అనిత తెలిపారు.

# సంపాదకీయం

మంగళవారం 13-08-2024

## లీవ్ ఇండియా ఎందుకు...

భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం.. ఇది ఎప్పటి నుంచో చదువుతున్నదే. ప్రపంచ దేశాలతో ఎన్నో విషయాల్లో పోటీ పడుతున్న భారత్ అభివృద్ధి చెందిన దేశం అని ఎప్పుడు అనిపించుకుంటుందోనని చాలా మంది ఎదురుచూస్తున్నారు. అంతరిక్షం, క్రీడలు, ఇతర విషయాల్లో భారత్ మిగతా దేశాల కంటే మెరుగైనప్రతిభను కనబరుస్తుంది. కానీ మానవ వనరుల అభివృద్ధి విషయంలో రోజురోజుకు క్షీణిస్తుంది. ఇది గ్రహించిన చాలా మంది తమ భవిష్యత్ కోసం దేశాన్ని విడిచి వెళుతన్నారు. ఉన్నత చదువులకోసమని విదేశాలకు వెళ్తున్న యువత అక్కడే సెటిలవుతోంది. ఇక్కడి నుంచి తమ కుటుంబాన్ని తీసుకెళ్లి విదేశీ పౌరులుగా మారుతున్నారు. ప్రస్తుతం పలు దేశాల్లో భారత్ సంతతికి చెందిన వారే మంచి పొజిషన్లో ఉన్నారు. ముమ్ముందు మరింత మంది ఇలాంటి వారు కనిపిస్తారు. అయితే భారత్ నుంచి ఇలాంటి నైపుణ్యం ఉన్నవారు ఎందుకు తరలిపోతున్నారు? భారత్ లో ఉన్న మైనస్ ఏంటి? ఆ వివరాల్లోకి వెళితే..2024 కేంద్ర బడ్జెట్ ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారమన్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ సందర్భంగా పన్ను విధానంలో మార్పులు చేశారు. స్టాండర్డ్ డిటక్షన్ రూ.50 వేల నంచి రూ. 75 వేలకు పెంచారు. ఇదే సమయంలో దీర్ఘ కాలిక పెట్టుబడులపై 12 శాతం, స్వల్ప కాలిక మూలధన లాభాలపై 20 శాతం పెంచారు. దీంతో చాలా మంది యువత ఈ పన్నుల భారం పడలేకపోతుందని తెలుస్తోంది. కొందరు ఉన్నతంగా ఎదగాలని చూసినా వారికి పన్నుల రూపంలో అడ్డు తగులుతున్నట్లు తెలుస్తోంది. మిగతా దేశాలతో పోలిస్తే భారత్ లో నైపుణ్యం కలవారు ఎక్కువ. అందుకే చాలా దేశాలు ఇండియాకు చెందిన వారు నియమించుకుంటున్నారు. భారత్ కంటే ఎక్కువ స్థాయిలో వేతనాలు అందిస్తూ పన్ను మినహాయింపు ప్రకటిస్తున్నారు.2023 లెక్కల ప్రకారం భారత్ నుంచి 13.2 లక్షల మంది 68 దేశాలకు ఉన్నత విద్యకోసం తరలివెళ్లారు. వీటిలో అత్యధికంగా కెనడాలో 4.27 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. ఆ తరువాత అమెరికాలో 3.51 లక్షలు, యూఏఈలో 2.47 లక్షలు, ఆస్ట్రేలియాలో 1.25 లక్షల మంది తరలివెళ్లారు. దశాబ్ద కాలంలో భారతీయ పౌరులపై ప్రభుత్వాలు అధిక పన్నుభారం వేస్తున్నాయి. కొందరు మెరుగైన ఉద్యోగాలు సాధించినప్పటికీ వారికి వచ్చే ఆదాయంలో పన్ను చెల్లించడమే ఎక్కువవుతోంది. ఈ కారణంగా విదేశాలకు వెళ్తున్నారు.ఇప్పటి వరకు విదేశాలకు వెళ్లిన వారు తమ కుటుంబాలను తీసుకెళ్తే 1 కోటి జనాభా తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా విదేశాల్లో చదివే విద్యార్థులు తమ విద్య కోసం రూ.33 కోట్లు వెచ్చిస్తున్నారు. భారత్ ఈ ఆదాయాన్ని కోల్పోతున్నట్లే చెప్పారు. అయితే మెరుగైన విద్య అందిస్తూ పన్నుల భారం తగ్గిస్తే ఈ ఆదాయం వచ్చే అవకాశం ఉందని కొందరు ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇక 2020లో భారత పౌరసత్వం వదులుకున్న వారి సంఖ్య 85,256. 2019లో ఇది 1,44,017. 2015 నుంచి 2020 మధ్య 8 లక్షల మందికి పైగా ప్రజలు భారత పౌరసత్వాన్ని వదులుకున్నారు. కరోనా వల్ల 2020లో ఈ సంఖ్య తగ్గినట్లుగా కనిపిస్తోంది. '2021లో విదేశాల్లో పౌరసత్వం తీసుకున్న వారి సంఖ్య పెరిగినట్లు కనిపించడానికి కారణం కరోనా. 2020లో కరోనా వల్ల సిటిజెన్‌షిప్ లభించని వారికి ఆ తరువాత ఏడాది లభించింది' అని విదేశీ వ్యవహారాల నిపుణుడు హర్ష్ పంత్ తెలిపారు చిన్నచిన్న దేశాలు కూడా వ్యాపారం చేసుకోవడానికి మంచి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఆయా దేశాల్లో ఇప్పటికే స్థిరపడ్డ బంధువుల సాయంతో కొందరు అక్కడకు వెళ్తున్నారు' అని హర్ష్ పంత్ వివరించారు. జర్నలిస్ట్ అయిన హరేంద్ర మిశ్ర, 22 ఏళ్లుగా ఇజ్రాయెల్‌లో ఉంటున్నారు. తనకు భారత్‌తో చాలా ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉందని, అందువల్లే ఇండియా పౌరసత్వాన్ని వదులుకోలేక పోతున్నానని ఆయన అన్నారు. ఆయన భార్యది ఇజ్రాయెల్. వారి ఇద్దరు పిల్లలు అక్కడే పుట్టారు. వారికి ఆ దేశ పౌరసత్వం ఉంది.'ఇండియా పాస్‌పోర్ట్ వల్ల ఒక సమస్య ఉంది. చాలా దేశాలకు వెళ్లాలంటే వీసా తీసుకోవాల్సి ఉంటుంది. లండన్ వెళ్లాలంటే నేను తప్పకుండా వీసా తీసుకోవాలి. కానీ ఇజ్రాయెల్ పాస్‌పోర్ట్ ఉంటే వీసా అవసరం లేదు. వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా ఇక్కడ ఆఫీసు లేదు. స్టాంపింగ్ కోసం ఇస్తాంబుల్ పోవాల్సి ఉంటుంది. అక్కడికి వెళ్లి రావడానికి చాలా ఖర్చు అవుతుంది. నేను సెంటిమెంటల్‌గా భారత పౌరసత్వం ఉంచుకున్నా. కానీ దాని వల్ల నాకు అంతకు మించి పెద్ద ప్రయోజనం ఏమీ లేదు' అని హరేంద్ర మిశ్ర వివరించారు. ప్రస్తుతం భారత్ పాస్‌పోర్ట్‌తో వీసా లేకుండా 60 దేశాల వరకు వెళ్లొచ్చు. ఇతర దేశాల పాస్‌పోర్టులతో పోలిస్తే ఇది తక్కువే. పాస్‌పోర్ట్ ర్యాంకుల్లో 199 దేశాల్లో 87వ స్థానంలో భారత్ ఉంది.ఈ పన్ను విధానంలో మార్పులు తీసుకురాకపోతే ముమ్ముందు భారత్ లో నైపుణ్యం కలిగిన విద్యార్థులు కనిపించరని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కొందరు కోరుతున్నారు

## న్యాయవాదుల సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తాం : పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ : న్యాయవాద దంపతులపైపోలీసులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. న్యాయవాదుల నిరసన దీక్షకు మద్దతు తెలుపుతున్నామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిఅన్నారు. శుక్రవారం ఆయన జనగామలో న్యాయవాదుల దీక్ష శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లాయర్స్‌పై దాడికి పాల్పడిన పోలీసులను బదిలీ చేయడం కాదు, ఉద్యోగాల నుంచి తొలగిం చాలని డిమాండ్ చేశారు. ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులు లంచాలకు మరిగి ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు.ఒక ఎమ్మెల్యేగా ఉన్న తనపైనే నాలుగు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటే సామాన్య ప్రజలను ఇంకెం తగా వేధిస్తున్నారో తెలుస్తుందన్నారు. దొంగలను, దోపిడీదారులను పట్టుకోమని పోలీసులను పెడితే, పోలీసు లే దొంగలుగా మారి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారని విమర్శించారు. న్యాయవాదుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావిస్తానని అడ్వకేట్లకు హామీ ఇచ్చారు. కాగా, జనగామలో న్యాయవాద దంపతులపై పోలీ సుల దాడి ఘటనపై ఉ న్నతాధికారులు సీరియస్ అయ్యారు. జనగామ ఇన్‌స్పెక్టర్ ఎల్. రఘుపతి రెడ్డి, ఎస్ఐ పీ. తిరుపతిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు.



## ఆర్థిక అస్థిరతను కాంగ్రెస్ సృష్టిస్తోంది: రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ: భారతీయ స్టాక్ మార్కెట్లను కూల్చేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నినట్లు బీజేపీ నేత రవి శంకర్ ప్రసాద్ఆరోపించారు. అదానీ గ్రూపు ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసర్చ్ సంస్థ తాజాగా రిలీజ్ చేసిన రిపోర్టుపై బీజేపీ కౌంటర్ అటాక్ చేస్తోంది. మాజీ కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక అస్థిరతను కాంగ్రెస్ సృష్టిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. భారత్‌పై ద్వేషం పెరిగేలా చేస్తున్నట్లు పేర్కొన్నారు. భారతీయ మార్కెట్లు చాలా సురక్షితంగా, నిలకడగా, ఆశాజనకంగా ఉన్నట్లు ఆయన చెప్పారు.మూడవ సారి లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన నేపథ్యంలో.. కాంగ్రెస్ తో పాటు తన టూల్‌కిట్ సిబ్బంది భారతీయ ఆర్థిక వ్యవస్థ దెబ్బతీస్తున్నట్లు ఆరోపించారు. కంట్రోల్ రాజ్‌ను తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారమే రిపోర్టు రిలీజైందని, ఆదివారం ఈ అంశం గురించి తీవ్ర స్థాయిలో విష ప్రచారం చేసినట్లు ఆరోపించారు. టూల్ కిట్, చిట్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నట్లు చెప్పారు. కానీ ఇవాళ భారతీయ స్టాక్ మార్కెట్ స్థిరంగా ఉన్నట్లుచెప్పారు. చిన్న ఇన్వెస్టర్లకు సెల్యూట్ చేయాలని, ఎందుకంటే వాళ్లు టూల్ కిట్‌ను, హిండెన్‌బర్గ్‌ను నమ్మలేదన్నారు.వీదేశీ సంస్థల్లో సెబీ చీఫ్ బధహబ్ పురి బుచ్‌కు పెట్టుబడులు ఉన్నట్లు హిండెన్‌బర్గ్ ఆరోపించింది. ఆ ఆరోపణలను అదానీ గ్రూపు కొట్టివేసింది. హిండెన్‌బర్గ్ విషయంలో న్యాయ ప్రక్రియ చేపట్టడంలో కాంగ్రెస్ విఫలమైనట్లు ప్రసాద్ ఆరోపించారు.

## సెబీ చీఫ్ తక్షణమే వైదొలగాలి : సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ. రాజా




హైదరాబాద్, అదానీ విదేశీ ఫండ్లలో సెబీ చీఫ్, ఆమె భర్తకు వాటాలున్నాయని షార్ట్ సెల్లింగ్ సంస్థ, మార్కెట్ రీసెర్చి కంపెనీ హిండెన్‌బర్గ్ తాజా నివేదిక దేశవ్యాప్తంగా పెను దుమారం రేపుతోంది. కార్పొరేట్ కంపెనీల ముందు ప్రస్తుత ప్రభుత్వం ఎలా సాగిలపడుతున్నదనే వివరాలను హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతం చేయడంతో రాజకీయ నేతలు ఈ నివేదికపై భుజాలు తడుముకుంటున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా పేర్కొన్నారు.మార్కెట్ కార్యకలాపాలను సెబీ నియంత్రించాల్సి ఉండగా సెబీ చీఫ్, ఆమె భర్త అదానీ గ్రూప్ విదేశీ ఫండ్లలో వాటాలు కలిగిఉన్నారని వివరించారు. మరి ఈ క్రమంలో సెబీ మార్కెట్‌ను ఎలా నియంత్రిస్తుంది, సెబీ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందా అనే సందేహాలు వెల్లడవుతున్నాయని చెప్పారు. సెబీ అధిపతిగా కొనసాగేందుకు ఆమెకు ఏమాత్రం నైతిక హక్కు లేదని, తక్షణమే సెబీ చీఫ్‌గా వైదొలగాలనే డిమాండ్లు ముందుకొచ్చాయని అన్నారు.హిం డెన్‌బర్గ్ నివేదికలో తీవ్రమైన అంశాలు వెలుగుచూశాయని, ఇందులో ఆర్థిక, రాజకీయ అంశాలు ఇమిడిఉండటంతో ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలన్నింటిపై లోతైన దర్యాప్తు జరిపేందుకు జేపీసీ ఏర్పాటు చేయడం మేలని చెప్పారు. రాహుల్ గాంధీ కూడా జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటును కోరుతున్నారని తెలిపారు. ఆర్థిక వ్యవస్థను సరిగ్గా నిర్వహించడం లేదని, పాలకులు కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థ ఛిద్రమవుతున్నదని, ఇప్పుడిదే అందరినీ బాధిస్తున్న విషయమని ఆయన పేర్కొన్నారు.

## 15 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

**రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా**
**45 రోజుల పాటు నిర్వహణ .. మరో 45 రోజుల్లో పరిష్కారం**
**భూ కబ్జాలు, రీ సర్వేతో వచ్చిన కష్టాలూ చెప్పుకోవచ్చు**
**ప్రజల నుంచి 5 కేటగిరీల్లో పిటిషన్ల స్వీకరణ**
**ఆర్టీజీఎస్ పరిధిలో ప్రత్యేక విభాగంతో పర్యవేక్షణ**
**ఎవరెవరు పాల్గొంటారు**
**గ్రామ సదస్సులో...**

1.తహసీల్దార్, 2.రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, 3.గ్రామ రెవెన్యూ అధికారి, 4. మండల సర్వేయర్, 5. దేవదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, 6. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి, 7.అటవీ శాఖ అధికారి పాల్గొంటారు.సున్నితమైన భూసమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నందున కార్యక్రమం పూర్తయ్యేవరకు పోలీసులతో భద్రత ఏర్పాటు చేస్తారు.జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టిన భూ వివాదాల చిచ్చును పరిష్కరించేందుకు చంద్రబాబు ప్రభుత్వం నడుం బిగించింది. 'ప్రజల వద్దకే పాలన' తరహాలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఎక్కడికక్కడ అధికారులు భూ సమస్యలను తెలుసుకుంటారు. ఆగస్టు 15వ తేదీ నుంచి 45 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. మరో 45 రోజుల్లో సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తారు. గత ఐదేళ్లలో భారీగా భూ అక్రమాలు జరిగాయి. పేదలు, బడుగువర్గాలు, అణగారిన వర్గాల భూములను వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకొని రికార్డులను తారుమారుచేసి వారికి నరకం చూపించారు. ఇదేమిటని అడిగితే సమాధానం చెప్పే దిక్కులేదు. ఉద్దేశపూర్వకంగా వెబ్‌ల్యాండ్‌లో చిన్న, చిన్న మార్పులు చేసి ప్రజలను హింసించారు. కొత్త ప్రభుత్వం వచ్చాక స్వీకరిస్తోన్న వినతిపత్రాల్లో సగానికిపైగా భూ వివాదాలపైనే ఉంటున్నాయి. జగన్, ఆయన అనుయాయులు చేసిన పాపాలు సరిదిద్దకపోతే గ్రామాల్లో అరాచకం ప్రబలుతుందని, పేదల నోటికాడి ముద్దను తీసేసినట్లవుతుందని భావించిన ప్రభుత్వం తక్షణమే ఆ సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. 45 రోజులపాటు ఊరూరా తిరిగి అధికార యంత్రాంగాన్ని మోహరించి ఎక్కడికక్కడే సమస్యలు తెలుసుకోవడం, ఆ తర్వాత 45 రోజుల్లో వాటికి పరిష్కారం చూపడం...ఇదే ప్రస్తుత టార్గెట్. ఈ నెల 15న మంత్రులు లాంఛనంగా గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తారు. ఆ తర్వాత 16నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు అంటే 45 రోజుల పాటు సదస్సులు నిర్వహించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా గ్రామాల్లో సదస్సుల నిర్వహణ తేదీలను 13నాటికే ఖరారు చేయాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. సదస్సుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఓ సీనియర్ ఐఏఎ?నను ప్రత్యేక అధికారిగా నియమిస్తారు. జేసీ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. ఈ సదస్సుల్లో జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, సభ్యులు, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా కలెక్టర్‌లు తగిన చొరవ తీసుకోవాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు.

## కోట్ల ను మర్యాదపూర్వకంగా కలిసిన తాసిల్దార్..



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 11 డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ని నూతన తాసిల్దార్ నాగమణి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు

## జీవో 117రద్దు చేయాలి...




విబారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 11 డోన్ నియోజకవర్గం శాసనసభ్యుడు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కి డోన్ , ప్యాపిలి మండలాల యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర ఆడిట్ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, ప్రధాన కార్యదర్శి గోపాల్, ప్యాపిలి మండల అధ్యక్షుడు క్రిష్ణ నాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 117 రద్దుచేసి జీవో నెంబర్ 53 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ప్రైమరీతోపాటు ఒకటి నుండి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని, హైస్కూల్లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లతీఫ్ ,సుంకన్న, బాల రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మనోహర్ ,ప్రసాద్, సుబ్బరాయుడు, రహీం, లక్ష్మీ నాయక్ ,చంద్రమోహన్, అంజనప్ప ,సుమన్ ,శంషాద్ బేగం ,రామాంజనేయులు, నాగ లక్ష్మయ్య ,సంజీవ రాయుడు , సుందరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వంశీకుమార్ పుట్టినరోజు సందర్భంగా స్ఫూర్తి ఆధ్వర్యంలో అన్నదానాలు ...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 11 అనంతపురం జిల్లా గుంతకల్లు ప్రాంతానికి చెందిన ఇంజనీర్ జి. వంశీ కుమార్ ఎన్నారైగా అమెరికాలో స్థిరపడ్డారు. సోమవారం నాడు వంశీ కుమార్ పుట్టినరోజు సందర్భంగా వారి ధర్మపత్ని, గుత్తి దగ్గర గల ఋషి గోశాల నిర్వాహకురాలు, సేవా సహృదయరాలు అమెరికాలో ఉండే డాక్టర్ మాధవి లత స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం, పద్మావతి వృద్ధాశ్రమంలో, డోన్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేయించి వందలాది మంది అన్నార్తుల ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రజలు, ఆశ్రమ వృద్ధులు, ఆకలి తీర్చుకున్న అభాగ్యులు ఎన్నారై వంశీ కుమార్ కి శుభాకాంక్షలు తెలిపి, ఎంతోమంది కడుపు నింపిన డాక్టర్ మాధవి లతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సంస్థ సభ్యులు స్ఫూర్తి మధు, నారాయణ స్వామి, మోహన్ గౌడ్, ప్రవీణ్, భాస్కర్, మోహన్ రెడ్డి, శివయ్య, సురేష్, వాల్మీకి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

## మాజీ భర్త ఇంటి ముందు ధర్నా

హైదరాబాద్ ఆగస్టు 12 తన కూతురి కోసం మాజీ భర్త ఇంటి ముందు ఆందోళన చేపట్టింది ఓ తల్లి. ఓయూ పీఎస్ పరిధి హబ్సిగూడ రవీంద్ర నగర్ లో ఈ ఘటన చోటు చేసుకుంది.పావని, నవీన్ రెడ్డి లకు గత 7 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన సంవత్సరం తర్వాత భార్య భర్తలు విడిపోయారు. పావని తన తల్లి దగ్గర ఉంటోంది. భార్య భర్త లకు కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నేపథ్యంలో కూతురు ఒకరోజు తన వద్ద ఉంచుకుంటాను అని చెప్పి తన వద్దే ఉంచుకున్నాడు తండ్రి. వారం గడుస్తున్నా తన కూతురిని తనకు ఇవ్వక పోవడం తో భార్య, భర్త ఇంటి ముందు బంధువులతో కలిసి ఆందోళన చేపట్టింది. ఈ ఇన్ని రోజులుగా తనే వద్ద ఉన్న 5 సంవత్సరాల చిన్నారి నీ ఒక్క రోజు తన వదా ఉంటుందని చెప్పిన భర్త పాపను అప్పింగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. పాప పేరు మీద 4 ఎకరాల భూమి కోసం భర్త ఇలా చేస్తున్నాడని భార్య ఆరోపించింది. కోర్టు తీర్పు ప్రకారం బిడ్డ తన వద్దే ఉండాలని, కానీ నా కూతుర్ని నాకు దూరం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా తన కూతురిని అప్పగించాలని వేడుకుంటుంది

# సజ్జల డైరెక్షన్ లోనే దువ్వాడ వ్యవహారం

శ్రీకాకుళం, ఆగస్టు 12 ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వ్యవహారం వీధిన పడింది. గత కొద్దిరోజులుగా మీడియాకు హాట్ టాపిక్ గా మారింది. రెండు రాష్ట్రాలకు వినోదం పంచుతోంది. అయితే ఎమ్మెల్సీ దువ్వాడ వైఖరి పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి కుటుంబంలో గొడవలు ఉంటాయని చెబుతున్న దువ్వాడ.. అందరూ తనలా వీధిన పడడం లేదన్న విషయాన్ని గుర్తుంచుకోలేకపోతున్నారు. భార్యాబిడ్డలపై కేసులు పెట్టరన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. నాలుగు గోడల మధ్య సమస్యను పరిష్కరించుకోవాలన్న ఇంగిత జ్ఞానం లేకుండా వ్యవహరిస్తున్నారు. తాను ఒక నాయకుడినని.. తన కుటుంబ వివాదమే పరిష్కరించుకోలేని స్థితిలో దువ్వాడ ఉండడం విచారకరం. అయితే ఇంత జరుగుతున్నా.. దువ్వాడ శ్రీనివాస్ కు అండగా వైసీపీ నేతలు రంగంలోకి దిగడం లేదు. హై కమాండ్ ఇంతవరకు స్పందించలేదు. తమ పార్టీ నేత కుటుంబం రోడ్డున పడింది.మీడియాకు ఎక్కింది.పార్టీని చులకన చేస్తోంది.ఇవేవీ అధినేత జగన్ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదే దువ్వాడ జగన్ కుటుంబం పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. దీటైన సమాధానం చెప్పేవారు. ఎంతలా అంటే జనసేన అధినేత పవన్ కు చెప్పు చూపేటంతగా.కానీ ఇప్పుడు అదే దువ్వాడ కుటుంబ కష్టాల్లో ఉంటే.. జగన్ తన కష్టం కాదన్నట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇటువంటి వాటికి ఫుల్ స్టాప్ పెట్టాలన్న ఆలోచన కూడా చేయకపోవడం పార్టీ శ్రేణులకు ఆందోళన కలిగిస్తోంది. దువ్వాడ ఒక మూర్ఖుడిలా వ్యవహరిస్తున్నారు. ఆయనను నియంత్రించాల్సిన హైకమాండ్ పట్టించుకోవడం లేదు. దీంతో క్యాడర్ అంతా తెలుగుదేశం పార్టీ వైపు చూస్తోంది.మంత్రి అచ్చన్న గేట్లు తెరిచిన మరుక్షణం టెక్కలి లో వైసీపీ ఖాళీ కావడం ఖాయం.వాస్తవానికి దువ్వాడ శ్రీనివాస్ ఓ మహిళతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారని గత మూడేళ్లుగా శ్రీకాకుళం జనాలకు తెలుసు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అధికారాన్ని చలాయించారు దువ్వాడ. కేవలం కింజరాపు కుటుంబం పై దువ్వాడను ప్రోత్సహించారు జగన్. అధికారాన్ని తలకెక్కించుకున్న దువ్వాడ ఇష్టా రాజ్యంగా చెలాయించారు. చివరకు ఒక మహిళ ట్రాప్ లో పడ్డారు. దువ్వాడ తన ఇంటికి వెళ్లకుండా ఆ మహిళతోనే ఉంటున్నారు అన్న విషయం అందరికీ తెలిసిందే.కానీ పార్టీ కట్టడి చేయలేదు. దువ్వాడ భార్యాబిడ్డల ఆందోళనను గమనించలేదు. కుటుంబ వ్యవహారాన్ని వ్యాపార కోణంలో చూశారు.ప్రజా జీవితంలో ఉన్న వారి వ్యక్తిగత వ్యవహార శైలిని అందరూ చూస్తారు. అంతెందుకు ఇదే దువ్వాడ శ్రీనివాస్ పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి అనరాని మాటలను అన్నారు.

హిందూమతం ఏకపత్నీ విధానం గురించి మాట్లాడారు. పవన్ ను నీచుడితో పోల్చారు. కానీ అదే పవన్ విడాకులు తీసుకున్నాక.. వారి సమ్మతంతోనే వివాహాలు జరుపుకున్నారు అన్న విషయాన్ని మరిచిపోయారు. పెళ్లి ఈడుకు వచ్చిన ఇద్దరు పిల్లలు ఉన్నారు అన్న విషయాన్ని గ్రహించుకోలేక.. వేరే మహిళతో సన్నిహిత్యంగా ఉన్నానన్న విషయాన్ని తానే ఒప్పుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అలా చేయాల్సి వచ్చిందని చెబుతున్నారు.అయితే దువ్వాడ కుటుంబ వ్యవహారానికి ముమ్మాటికీ సజ్జలే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. దువ్వాడ వ్యవహార శైలి పై ఫిర్యాదులు వచ్చాయి. ఆయన భార్య వాణి ఫిర్యాదు చేశారు. న్యాయం చేయకుంటే ఆత్మహత్య శరణ్యమని చెప్పుకొచ్చారు. అయితే అప్పట్లో ఆస్తులు పిల్లలిద్దరికీ పంపకాలు చేపడతారని.. వైసీపీ టికెట్ మీదేనంటూ చెబుతూ ఇంచార్జ్ పదవి అప్పగించారు. కానీ ఆస్తులు రాయలేదు. ఇచ్చిన ఇన్చార్జి పోస్టు తీసేసారు. ఇండిపెండెంట్ గా పోటీ చేస్తానన్న వాణిని సముదాయించారు. ఇప్పుడు ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడంతో వాణిని పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పుడు అదే మహిళతో బహిరంగంగానే తిరగడం ప్రారంభించారు దువ్వాడ. ఇంతటి వివాదానికి సజ్జలే కారణమని వాణి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కానీ ఇంతవరకు వైసీపీ నుంచి ఈ వ్యవహారంపై ఎటువంటి ప్రకటన రాలేదు.

## క్రైమ్ సిటీగా మారుతున్న టెంపుల్ సిటీ

తిరుపతి, ఆగస్టు 12 టెంపుల్ సిటీలో క్రైమ్ రేట్ పెరిగిపోవడంతో జనంలో ఆందోళన నెలకొంది. వరుస హత్యలు, దాడులతో ఆధ్యాత్మికతకు మచ్చగా మారుతోంది. ఈ మధ్య కాలంలో వరుసగా జరుగుతున్న ఘటనలు ఇందుకు అద్దం పడుతోంది. గంజాయి మత్తులోనే యువత నేరాలకు పాల్పడుతున్నట్లు స్పష్టం అవుతోంది. 4రోజుల క్రితం తిరుపతిలోని సుందరయ్య నగర్?లో మైనర్ బాలిక ప్రేమ వ్యవహారంలో జరిగిన ప్రేమోన్మాద దాడి టెంపుల్ సిటీని ఉలిక్కిపడేలా చేసింది. ఈ క్రమంలోనే డ్రగ్ కల్చర్ కొనసాగుతుందన్న విషయం వెలుగులోకి వచ్చింది. సుందరయ్య నగర్?లో ఒక మైనర్ బాలికపై జరిగిన దాడి గంజాయి మత్తులోనే జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే ఇప్పుడు టెంపుల్ సిటీలో చర్చగా మారింది. పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను సుందరయ్య నగర్?కు చెందిన బాలు అనే యువకుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. అదే క్రమంలో జరిగిన దాడిపై బాలిక తల్లి సుందరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఉపాధి కోసం కువైట్?కు వెళ్లిన సుందరి మైనర్ కూతురు, కొడుకును సుందరయ్య నగర్?లోని తల్లి ముత్యాలమ్మ సంరక్షణలో పెట్టి చదివిస్తోంది. గత కొద్దికాలంగా సుందరయ్య నగర్?కి చెందిన బాలు అనే యువకుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు తెలుసుకుని.. సుందరి కుటుంబ సభ్యులు వారించే ప్రయత్నం చేశారు. కూతురు ప్రేమ విషయం తెలుసుకొని కువైట్ నుంచి తిరిగి వచ్చిన తల్లి సుందరి.. బాలు అనే యువకుడి నిర్వాకంపై నిలదీసింది. సుందరి కొడుక్కి, బాలు అనే యువకుడికి మధ్య ఈ వ్యవహారంపై ఘర్షణ కూడా జరిగింది. మైనర్ బాలిక ప్రేమ వ్యవహారం రెండు రోజుల క్రితం కత్తులతో దాడికి దారి తీసింది. మైనర్ బాలిక అన్నకు.. బాలు బ్యాచ్ తో జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది.మైనర్ బాలిక తల్లి సుందరి, మేనమామ సురేష్??, బాలు తమ్ముడు లోకేష్ కత్తిపోటుకు గురయ్యారు. ఇలా రెండు కుటుంబాల్లో ముగ్గురు గాయపడ్డారు.ఈ గొడవపై ఇరు వర్గాల ఫిర్యాదులతో తిరుపతి ఈస్ట్ పిఎస్ లో కేసులు కూడా నమోదు అయ్యాయి. అయితే మైనర్ బాలిక ప్రేమ వ్యవహారం, జరిగిన దాడులు గంజాయి మత్తు కారణమండ విమర్శలు ఉన్నాయి. గంజాయి, డ్రగ్స్ ముఠానే తన కూతురిని ట్రాప్ చేసేందుకు కారణమని తల్లి సుందరి అరోపిస్తోంది. అయితే అన్న బాలు బ్యాచ్ ఆగడాలను కూడా కొందరు వెలుగులోకి తెచ్చారు. మైనర్ బాలిక అన్న బాలుకు గంజాయి, డ్రగ్స్ అలవాటున్నట్లు ఆ బ్యాచ్ పై ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి వరుస ఘటనలు తిరుపతిలో భయాన్ని కలిగిస్తున్నాయి. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో డ్రగ్ కల్చర్ పెరిగిందని, గంజాయి మత్తుకు యువత బానిసవుతోందని కొందరు మహిళలు ఆరోపిస్తున్నారు. గంజాయిపై ఉక్కు పాదం మోపాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తుంది. టెంపుల్ సిటీలో ఇలాంటి కల్చర్ వెంటనే నిరోధించాలంటు న్నారు స్థానికులు.ఇక పోలీసు యంత్రాంగం గంజాయి అమ్మకం, వినియోగాన్ని కట్టడి చేయలేకపోతోంది. విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న గంజాయిపై ఉక్కు పాదం మోపలేకపోతోంది. తక్కువ ధరకు ఈజీగా దొరుకు తుండడంతో మైనర్ల జీవితం కూడా గంజాయితో ముడి పడిపో తుంది. అరకు టు చెన్నై, వేలూరు, బెంగళూరు వయా రేణిగుంట, తిరుపతి మీదుగా జరుగుతున్న గంజాయి సప్లై ఇలాంటి ఘటనలకు కారణం అవుతోంది. దీంతో మైనర్లు, స్టూడెంట్లు డ్రగ్ కల్చర్?ను స్వాగతిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇలా గంజాయికి బానిసలు అవుతున్న యువతపై నిఘా పెట్టిన తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం కట్టడి చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ర్పాటు చేసింది.ప్రజల సహకారం ఉంటే తప్ప నిర్మూలించలేమని చేతులెత్తేస్తున్న పరిస్థితి నెలకొంది.గంజాయిఅమ్మకం,వాడకంపై సమాచార మిచ్చి సహకరించాలని స్థానికులను కోరుతోంది పోలీసు యంత్రాంగం.

## 50 రోజుల్లో 53 వేల ఫిర్యాదులు

విజయవాడ, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీఏ) కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాదర్బార్ మొదలు పెట్టారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు.. వారి నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అందులో భాగంగానే మంత్రులు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వారానికి రెండ్రోజులు? టైమ్ టేబుల్ వేసుకుని మరీ ఉంటున్నారు. సీఎం చంద్రబాబు సైతం తనవంతుగా వెళ్లి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు స్వీకరించారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నడుస్తున్న ఈ ప్రజాదర్బార్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు పోటెత్తాయి. రాష్ట్ర నలుమూలల నుంచి 50 రోజుల్లో 53 వేల ఫిర్యాదులు రావడం చర్చనీయాంశమైంది.ఇక ఈ ఫిర్యాదుల్లో ఎక్కువశాతం రెవెన్యూ సంబంధిత సమస్యలే ఉన్నట్లు తెలుస్తోంది. భూ ఆక్రమణ కేసులు, భూ కబ్జా కేసులే అధికంగా ఉన్నట్లు సమాచారం. అలాగే గ్రామాల్లోని త్రాగునీటి సమస్యలపైనా పెద్ద ఎత్తున ఫిర్యాదులందినట్లు తెలుస్తోంది. మరోవైపు గత ప్రభుత్వంలో అక్రమ కేసులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపైనా అర్జీలు అందినట్లు అధికారులు చెబుతున్నారు.

## భయం..భయంగా వైసీపీ నేతలు

విజయవాడ, ఆగస్టు 12 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి పార్లమెంటు ఎన్నికలతోపాటు మూడు నెలల క్రితం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. వైనాట్ 175 నినాదంతో ప్రజల్లోకి వెళ్లిన జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని ప్రజలు కేవలం 11 స్థానాలకు పరిమితం చేశారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు. కూటమికి ఏకంగా 166 సీట్లతో తిరుగులేని మెజారిటీ కట్టబెట్టారు. దీంతో ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీలో కీలకంగా వ్యవహరించిన నేతలంతా ఇప్పుడు సైలెంట్ అయ్యారు. కనీసం నియోజకవర్గాల్లో కూడా కనిపించడం లేదు. సొంత వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. ఇక అధికార కూటమి నేతలు గతంలో తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలు, కార్యకర్తలపై ప్రతీకారం తీర్చుకుంటున్నారు. దీంతో వైసీపీ నేతలు బెంబేలెత్తిపోతున్నారు. ఒకవైపు చూస్తే పార్టీకి గౌరవ ప్రదమైన సీట్లు లేవు.. ఇంకోవైపు అధికార కూటమి ఇరు రాష్ట్రంలో.. అటు కేంద్రంలో బలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు వైసీపీ తరఫునా మాట్లాడినా ఇబ్బందే అన్న భావనలోచాలా మంది సైలెంట్ అయ్యారు. ఇక అధికారం లేకుండా ఐదేళ్లు ఎలా ఉండాలన్న ఆలోచనతో చాలా మంది అధికార కూటమి పార్టీలవైపు చూస్తున్నారు. అయితే కూటమి నేతలు కూడా చేరికల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు పూర్తిగా రాజకీయాల నుంచే తప్పుకుంటున్నారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలు ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చారు. విపక్ష నేతలపై అక్రమంగా కేసులు పెట్టించారు. అరెస్టులు చేయించారు. మాట వినని వారిని అంతం చేశారు. దీంతో ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ?జనసేన?బీజేపీ కూటమి నేతలు కూడా అదే పంథాలో ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా వైసీపీ పాలనలో ఇబ్బంది పడ్డ టీడీపీ నేతలు తమను వేధించిన వారిపై కక్ష తీర్చుకుంటున్నారు. నాడు అధికారం ఉందని ఇష్టానుసారం వ్యవహరించిన, మాట్లాడిన నేతలు ఇప్పుడు వైసీపీలో ఉండడానికి కూడా భయపడుతున్నారు. దీంతో రాజకీయాల నుంచే తప్పుకోవాలని నిర్ణయించుకుంటున్నారు. ఎన్నికలకు మూడు నెలల ముందు టీడీపీని వీడి వైపీపీలో చేరిన విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని.. మొన్నటి ఎన్నికల్లో కూడా ఎంపీగా పోటీ చేశారు. సొంత సోదరుడి చేతిలో ఓడిపోయాడు. దీంతో ఇప్పుడు రాజకీయాల నుంచే తప్పుకున్నారు.ఇప్పుడు వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆళ్ల నాని , ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ కూడా కేశినేని నాని బాటలో నడిచారు. ఏలూరు జిల్లా వైసీపి అధ్యక్ష పదవికి, నియోజకవర్గం ఇన్‌చార్జి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల చేతనే వైసీపీకి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే మాజీ మంత్రి మంత్రి ధర్మాన ప్రసాదరావు రాజకీయాల నుంచి తప్పుకోబోతున్నట్లు చెప్పగా, ఇటీవలే పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వైసీపీకి రాజీనామా చేశారు. రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి వేటాడాలనే జగన్ ఎంచుకున్న విధానం వలననే నేడు వైసీపి నేతలకు ఈ దుస్థితి కలిగిందని చెప్పక తప్పదు. ఇది వీళ్లకే పరిమితమయ్యే పరిస్థితి లేదు.. ఇప్పటికే కొడాలి నాటి, రోజాతోపాటు చాలా మంది మాజీ మంత్రులు సైలెంట్ అయ్యారు. దీంతో రాబోయే రోజుల్లో చాలా మంది రాజకీయాల నుంచి తప్పుకోవడం ఖాయం. ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే.. అధికార కూటమిలోకి వెళ్లే అవకాశం ఉండేది. కానీ, ఎమ్మెల్యే పదవి కూడా లేకపోవడంతో అటు కూటమి పార్టీలు కూడా వీరిని పట్టించుకునే పరిస్థితి లేదు. ఇటు ఐదేళ్లు అధికార పార్టీ వేధింపులు ఎదుర్కొంటూ ఉండలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో చాలా మంది రాజకీయాలకు స్వస్తి చెబుతారని నిపుణులు పేర్కొంటున్నారు.

## సిద్ధమైన అన్న క్యాంటీన్లు

### ఐదు సంవత్సరాల తర్వాత పూర్వ వైభవం

బద్వేలు,అన్న క్యాంటీన్లు.... కేవలం ఐదు రూపాయలకే పట్టెడు అన్నం పెట్టి పేదల ఆకలి తీర్చిన అక్షయపాత్రలు కేవలం 15 రూపాయలకే మూడు పూటలా కడుపు నింపే అన్నా క్యాంటీన్లు గత వైసిపి ప్రభుత్వ కక్ష సాధింపులకు బలయ్యాయి ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో పేదలకు అన్నం దక్కకుండా చేశాయి ఐదు సంవత్సరాలు పాటు అన్నా క్యాంటీన్లకు పట్టిన గ్రహణం ఇప్పుడు వీడింది కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలైంది ఈనెల 15 తేదీ రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా 100 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నారు అందులో భాగంగా కడప జిల్లా బద్వేల్ లో కూడా అన్నా క్యాంటీన్ ముస్తాబయింది ఉమ్మడి కడప జిల్లాలో వేలాదిమంది పేదల ఆకలి తెచ్చేందుకు ప్రభుత్వం2018 జులై 11వ తేదీ అన్నా క్యాంటీన్లు ప్రారంభించింది జిల్లాలో కార్పొరేషన్ తో పాటు మున్సిపాలిటీల్లో మొత్తం 8 క్యాంటీన్లు ఏర్పాటు చేసింది కడప నగరంలో మూడు రాజంపేట ప్రొద్దుటూరు రాయచోటి పులివెందుల బద్వేలు జమ్మలమడుగు మున్సిపాలిటీలో ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు వీటి ద్వారా ప్రతిరోజు వేలాదిమంది పట్టణ పేదలకు ఐదు రూపాయలకే టిఫిన్ భోజనం లభించేది గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వచ్చే దినసరి కూలీలకు మధ్యాహ్నం అన్నా క్యాంటీన్లు ఆకలి తీర్చేది వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారి కూడా మధ్యాహ్నం పూట అన్న క్యాంటీన్లలో అన్నం లభించడంతో వారికి ఆర్థిక భారం తగ్గేది ఇలా ప్రతిరోజు అన్నా క్యాంటీన్ లో భోజనం లభించేది తిరిగి ఇప్పుడు అలాంటి భోజనం లభించే అవకాశం రావడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

## ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు మృతి

చిత్తూరు,తిరుత్తణి సమీపంలోని కనకమ్మసత్రం పక్కనే ఉన్న రామంచేరి గ్రామ సమీపంలో ట్రక్కు, కారు ఢీకొనడంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులను తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చేర్చారు. చెన్నై–తిరుపతి జాతీయ రహదారిపై తిరువళ్లూరు జిల్లా కనకమ్మసత్రం పక్కనే ఉన్న రామంచేరి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చెన్నై నుంచి తిరుత్తణి వైపు వస్తున్న లారీ, ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న చెన్నైకి చెందిన ఏడు మంది ప్రైవేట్ కాలేజీ విద్యార్థుల్లో ఐదు మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు.గాయపడిన ఇద్దరిని తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చేర్చి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న కనకమ్మసత్రం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారు శిథిలాలలో చిక్కుకున్న వారి మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఎటూ కాకుండా పోయిన బైరెడ్డి




కర్నూలు, ఆగస్టు 12 వైసిపి హయాంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హంగామా అంతా అంతా కాదు. మంచి మాస్ ఇమేజ్ తో యువతరానికి ఆదర్శం అన్నట్టు ఆయన వ్యవహార శైలి ఉండేది. చుట్టూ మంది మార్బలంతో సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ చేసేవారు. నిత్యం యూట్యూబ్ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తూ నిత్యం ప్రచారంలో ఉండేవారు. యువనేత అంటే ఇలా ఉండాలి అనేటట్టు ప్రచారం కల్పించుకునేవారు. వైసీపీలోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నారు. అయితే అదంతా గాలి బుడగే అన్నట్టు ప్రస్తుతం బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పరిస్థితి మారింది. ఇప్పుడు ఆయనను పట్టించుకునే వారు కరువయ్యారు. వెంట నడిచేందుకు సైతం అనుచరులు ఇష్టపడడం లేదు. రాష్ట్రంలో వైసిపి ఓడిపోవడంతో ఒక్కొక్కరు సిద్ధార్థ రెడ్డిని వదిలేసి ఇతర పార్టీలో చేరుతున్నారు. చివరకు ఒంటరిగా మిగిలిపోయారు సిద్ధార్థ రెడ్డి. ఆయన పరిస్థితి చూసి అంతా జాలి పడుతున్నారు. సోషల్ మీడియాలో సైతం సెటైర్లు పడుతున్నాయి. వాస్తవానికి నందికొట్కూరు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. అక్కడ పోటీ చేసే ఛాన్స్ సిద్ధార్థ రెడ్డికి దక్కలేదు. గత రెండుసార్లు అక్కడ వైసీపీ ఎమ్మెల్యే గెలిచేసరికి అది తన చలువే అన్నట్టు సిద్ధార్థ రెడ్డి వ్యవహరించేవారు. మొత్తం నియోజకవర్గంలో ఎమ్మెల్యేను డమ్మీ చేసి అంతా తానై వ్యవహరించేవారు. దానికి తోడు 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో శాప్ చైర్మన్ పదవి సిద్ధార్థ రెడ్డికి వరించింది. దీంతో రాష్ట్రస్థాయి నాయకుడిగా చలామణి అయ్యారు సిద్ధార్థ రెడ్డి. కానీ ఇప్పుడు పార్టీ ఓడిపోవడంతో, పవర్ చేజారిపోవడంతో చుట్టూ ఉండేందుకు కూడా ఎవరు ఇష్టపడడం లేదు.నందికొట్కూరులో ఒక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు సిద్ధార్థ రెడ్డి. అయితే ఆయన బలానికి మించి సోషల్ మీడియాలో ప్రచారం జరిగేది. ఓ రేంజ్ లో ఆయన గురించి ఎస్టాబ్లిష్ చేసేవారు. సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ అయ్యేది. మరోవైపు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ప్రతినిధులను తన చెప్పు చేతల్లో ఉంచుకునేవారు సిద్ధార్థ రెడ్డి. వారంతా తనను చూసి, తన వెన్నంటి ఉండేవారని భావించారు. కానీ అధికారం దూరమయ్యేసరికి రెండు నెలల వ్యవధిలోనే ఒంటరిగా మిగిలారు సిద్ధార్థ రెడ్డినందికొట్కూరు మున్సిపాలిటీ నుంచి అప్పుడే టిడిపిలో చేరికలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ ఎన్నికల్లో నందికొట్కూరు లో వైసీపీకి ఏకపక్ష విజయం దక్కింది. మొత్తం 29 కౌన్సిలర్లకు గాను.. 21 మంది వైసీపీ నుంచి గెలిచారు. ఏడుగురు ఇండిపెండెంట్లు విజయం సాధించగా.. టిడిపి నుంచి మాత్రం ఒక్కరే గెలుపొందారు. దీంతో తన అనుచరుడు సుధాకర్ రెడ్డికి చైర్మన్ చేశారు సిద్ధార్థ రెడ్డి. ఇప్పుడు అదే సుధాకర్ రెడ్డి టిడిపిలో చేరుతున్నారు. తన వెంట మెజారిటీ కౌన్సిలర్లను తెలుగుదేశం పార్టీలోకి తీసుకెళ్తున్నారు. దీంతో నందికొట్కూరు మున్సిపాలిటీ టిడిపి వశం అయ్యింది.బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కేవలం వైసీపీ ఇన్చార్జిగా కొనసాగారు. శాప్ చైర్మన్ గా మాత్రమే నామినేట్ అయ్యారు. కానీ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి బాబాయ్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శబరి నంద్యాల ఎంపీగా గెలిచారు. ఎన్నికలకు ముందు టిడిపిలో చేరారు. నంద్యాల టికెట్ దక్కించుకొని ఎంచక్కా పార్లమెంట్ సభ్యురాలు అయ్యారు. కానీ వైసీపీ ఆవిర్భావం నుంచి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కనీసం ఎమ్మెల్యే కూడా కాలేకపోయారు. ఎన్నికల్లో జగన్ పెద్ద ఎత్తున అభ్యర్థులను మార్చారు. నందికొట్కూరు ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం నుంచి తను సూచించిన నేతకు జగన్ టిక్కెట్ ఇవ్వలేదు. తనకు సైతం ఇతర నియోజకవర్గాల్లో అవకాశం కల్పించలేదు. రెండిటికి చెడ్డ రేవడిగా మారిపోయారు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి.

## ఏపీలో పొట్టిశ్రీరాములు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలు

విజయవాడ, ఆగస్టు 12, తెలుగు రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో విభజన చట్టం ప్రకారం పదేళ్లపాటు సాగిన ఉమ్మడి ప్రవేశాలకు జూన్ 2తో బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన ఈ రెండు విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 2నాటికి పదేళ్లు పూర్తయినందున అవి ఏపీలో సేవలను నిలిపివేశాయి. ఈ క్రమంలో పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలు తెలంగాణ ప్రాంతానికి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశాయి. ఈ రెండు యూనివర్సిటీలలో ఈ విద్యాసంవత్సరం వరకు ప్రవేశాలను కొనసాగించాలని ఏపీ ఉన్నత విద్యాశాఖ ఇటీవల లేఖ రాసింది. దీనిపై ఇంతవరకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనరాలేదు. దీంతో ఏపీలోనూ తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. రెండు యూనివర్సిటీల ఏర్పాటుకు అయ్యే ఖర్చు ఎంత? మానవ వనరులు ఎంత అవసరమవుతాయి లాంటి అంశాలను ఉన్నత విద్యాశాఖ లెక్కలోకి తీసుకుంటుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఏపీలో శ్రీశైలం, కూచిపూడి, రాజమహేంద్రవరంలలో పీఠాలు ఉన్నాయి. వీటిద్వారా 200 మంది విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఉన్న కేంద్రానికి దాదాపు 35 ఎకరాల స్థలం ఉంది. అక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే బాగుంటుందనేది ప్రభుత్వ యోచనగా తెలుస్తోంది. ఏపీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలంటే దాదాపు 50 కోట్ల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని వర్సిటీలో ఉన్న కోర్సులన్నింటినీ ప్రారంభించాలంటే 72 బోధన పోస్టులు, 115 బోధనేతర పోస్టులు భర్తీచేయాల్సి ఉంటుంది.ఏపీలో కొత్తగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి రూ.63.85 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయిని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వర్సిటీలో 50 బోధన పోస్టులు, 68 బోధనేతర పోస్టులు అవసరమవుతాయి. ఇప్పటికిప్పుడు యూనివర్సిటీ ప్రారంభించాలంటే.. అద్దె భవనంలో ఏర్పాటు చేసి, నిర్వహించాల్సి ఉంటుంది. సార్వత్రిక విశ్వవిద్యాలయం తరఫున ఏపీలో 76 దూర విద్య కేంద్రాలు ఉన్నాయి. డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో కలిపి ప్రస్తుతం లక్షన్నర మంది చదువుతున్నారు. ఏటా సుమారు 16 వేల మంది ప్రవేశాలు పొందుతున్నారు. ఫీజుల రూపంలోనే వర్సిటీకి ఏపీ నుంచి రూ.21 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఏపీ స్టడీ సెంటర్లలో పని చేస్తున్న సిబ్బందికి జీతాల కింద రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.5.40 కోట్ల వరకు చెల్లిస్తోంది.

## 16వ తేదీ శుక్రవారం సూర్యనారాయణ స్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం...





కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 12 విభారె న్యూస్..16.08.2024 శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రత పర్వదినం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఉదయం 10 గంలకు సామూహిక వరలక్ష్మి వ్రతము జరుపబడును.(వ్రతము చేసుకొన దలచిన భక్తులు పంచామృతాలు, పండ్లు, పూలు, టెంకాయలు, తెచ్చుకొనగలరు)వ్రతమునకు:- 250/-సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్:8896123777.

## శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన ఆలయ జీర్ణోదరణ కొరకు భక్తుల విరాళం..



కౌతాళం ఆగస్టు 12 విభారె న్యూస్..శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన ఆలయ జీర్ణోద్ధరణ కొరకు సి బెళగల్ వాస్తవ్యులైన మంగమ్మ, గ్రామ ప్రజలు?.52,640/- విరాళంగా చెల్లించియున్నారు. అధికారులు దాతలకు శ్రీ స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రము, లడ్డు ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, జూనియర్అసిస్టెంట్ కుమారయ్య,శివ,మల్లికార్జున, విట్ఠల్,రమేష్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్.బి.ఎస్ కాలనీ సచివాలయం తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి...



ఎమ్మిగనూరు ఆగస్టు 12 విభారే న్యూస్..12-08-2024 న ఎమ్మిగనూరు మునిసిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి పట్టణంలోని హెచ్.బి.యస్. కాలనీ సచివాలయం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హాజరు రిజిష్టర్,ఇతర రికార్డులు పరిశీలించడం జరిగింది.ప్రజలకు అందించే సర్వీసులు ఎస్ ఎల్ ఏ ప్రకారం సక్రమంగా పూర్తి చేయాలని ఆదేశించారు.నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బందికి మధ్యాహ్న భోజనం..

ఎమ్మిగనూరు ఆగస్టు 12 విభారె న్యూస్..స్థానిక ఏపీఎస్ఆర్టీసీ ఎమ్మిగనూరు డిపోలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని రెండవ సోమవారం నాడు డిపో మేనేజర్ బి అమర్నాథ్ ఉరుకుంద సర్వీసు చేస్తున్నటువంటి డ్రైవర్ కండక్టర్లకు మధ్యాహ్న భోజనాన్ని ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎండి గౌస్ ఎమ్మెస్ వాసులు కోశాధికారి బసవరాజు సహాయ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో అందజేశారు.అందజేశారు. ఈ సందర్భంగా డి.ఎం. మాట్లాడుతూ సర్వీస్ చేస్తూ ఉరుకుంద వెళ్లేటప్పుడు మధ్యలో ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయి నిలబడిపోయి భోజనాలు లేకుండా డ్రైవర్ కండక్టర్లు ఇబ్బంది పడకుండా శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని డ్రైవర్ కండక్టర్లకు మధ్యాహ్న భోజన ప్యాకెట్లను అందజేస్తున్నామని ప్రతి సోమవారము, గురువారం ఇతర డిపోల నుండి స్పెషల్ బస్సులను తీసుకువచ్చి నడుపుతున్నట్లు ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, కార్యదర్శులు ముస్తాక్ అహ్మద్ లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని డిపో మేనేజర్ అమర్నాథ్ తో పాటు బస్టాండ్ మేనేజర్ ఎల్లప్ప, కంట్రోలర్ ఎండి గౌస్,ఎమ్మార్ నాత్, బీసీ శేఖర్,శ్రీదేవి,శ్యామల కే ఎన్ లింగయ్య తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రావణమాసంలో సోమవారం,గురువారం లలో స్పెషల్ బస్సులు నడపబడునని తెలిపారు.



## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 115 ఫిర్యాదులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం..



కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 12 విభారె న్యూస్...విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 115 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.

కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గిడ్డయ్య అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 1 లక్ష 50 వేలు తీసుకొని మోసం చేశాడని,డబ్బులు అడిగితే ఇస్తానని చెప్పి, ప్రామిసరి నోటు రాసి ఇచ్చి మోసం చేస్తున్నాడని కర్నూలు,ప్రకాష్ నగర్ కు చెందిన ప్రకాష్ ఫిర్యాదు చేశారు.2)నా కుమారుడు భువన్ కుమార్,కోడలు జ్యోతి నన్ను దుర్భాషలాడుతూ, వికలాంగుడైన తన తమ్ముడి ని కొడుతూ, అతని ఆస్తి కూడా తీసుకోవాలని,మమ్మల్ని మానసికంగా ప్రతి రోజు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు, జనార్దన్ నగర్ కు చెందిన లక్ష్మీ దేవి ఫిర్యాదు చేశారు.3) నాకు కుమార్తెలు పుట్టారని,నా భర్త బసవరాజు మమ్మల్ని పట్టించుకోకుండా నన్ను నా పుట్టింట్లోనే వదిలేసినాడని నాకు న్యాయం చేయాలని సి.బెళగల్ కు చెందిన అరుణమ్మ ఫిర్యాదు చేశారు.4) కోడుమూరు - వెంకటగిరి రోడ్డు లో ఉన్న మా స్థలాన్ని నాగ భూషి లక్ష్మన్న ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని కోడుమూరు వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ లక్ష్మమ్మ, గిడ్డయ్యలు ఫిర్యాదు చేశారు.5) ఖమ్మం జిల్లా నివాసి, జాకిరుల్లా కి చెందిన ఆల్ బర్కత్ ఎలక్ట్రో మెకానికల్ కంపెనిలో పెట్టుబడులు పెట్టాము,అది ఒక బోగస్ సంస్థ అని,నేను మోసపోయానని నాకు న్యాయం చేయాలని కర్నూలు,గడ్డ స్ట్రీట్ కు చెందిన మహమ్మద్ అలీం ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి,బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు శివశంకర్, హాజీవలి పాల్గొన్నారు.

# దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసి ఉద్యమం నడిపిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్..

**ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.రంగన్న**



ఎమ్మిగనూరు ఆగస్టు 12 విభారె న్యూస్..ఘనంగా జరిగిన ఏఐఎస్ఎఫ్ 89 వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి రంగన్న, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రంగస్వామి, కాజా.ఎమ్మిగనూరు పట్టణం లోని ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ బాలుర కళాశాల విద్యార్థులతో కళాశాల నుండి సోమప్ప సర్కిల్ మీదుగా పెద్ద ఎత్తున ఊరేగించి అనంతరం బాలుర కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏఐఎస్ఎఫ్ జెండాను ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.రంగన్న ఎగురవేసి ఘనంగా జరుపుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి రంగన్న,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర ,రంగస్వామి మాట్లాడుతూ ఉద్యమాలలో ఉద్భవించిన సమరశీల ఉద్యమాల సారధి,సూర్యుడు హస్తమించని బ్రిటీషు పాలకుల నుండి మన దేశాన్ని విముక్తి చేయడానికి బ్రిటీషు పాలకులను తరిమికొట్టి స్వాతంత్రోద్యమంలో దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసి ఉద్యమాన్ని నిర్మించిన ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు."స్వాతంత్రం మా జన్మహక్కు"అని భారతజాతి ఎలుగెత్తి నినదిస్తున్న తరుణంలో పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఉరికొయ్యలను ముద్దాడి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ స్ఫూర్తిగా ఆవిర్భవించిందని నాటినుండి నేటి వరకు దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించడానికి, హాస్టల్స్ ,స్కూల్స్ , కళాశాలల్లో విద్యార్థులు పడుతున్న సమస్యల పరిష్కారం కోసం ,అమ్మాయిలపై జరుగుతున్న ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ ,అఘాయిత్యాలకు వ్యతిరేకంగా అమ్మాయిలకు అండగా పోరాట మార్గాన్ని ఎంచుకుందని విద్యార్థులకు తెలిపారు. సమరశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ 88 సంవత్సరాలు పూర్తిచేసుకుని 89వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విద్యార్థి మిత్రులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తి తో విద్యను వ్యాపారం గా మారుస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ దేశానికి నిజమైన వారసులు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన ఏఐఎస్ఎఫ్ సంఘ నాయకులేనని తెలిపారు.ప్రస్తుతం మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం తీసుకువచ్చి విద్యను ప్రైవేటీకరణ కార్పొరేట్ ఈకరణ కషాయీకరణ చేయడానికి కుట్ర చేస్తూ దేశానికి పూర్తయిన పూలే,భగత్ సింగ్,అంబేద్కర్, పెరియార్,నారాయణ గురు వంటి వారి జీవిత చరిత్రలను, డార్విన్ సిద్ధాంతాలను పాఠ్యాంశాల నుండి తొలగించి బ్రిటిష్ వారికి తొత్తుగా వ్యవహరించిన సవర్కర్ జీవిత చరిత్రను చేర్చి దేశ చరిత్రను వక్రీకరిస్తూ బాల్యం నుంచే విద్యార్థుల మెదడులోకి మతతత్వ భావజాలాన్ని నింపుతున్నారని అటువంటి నూతన జాతీయ విద్యా విధానం పట్ల విద్యార్థులందరూ ఏకతాటిపై కలసి పోరాటాలు చేయవలసిన అవసరం ఆవశ్యకత ఉందన్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్య వ్యతిరేక విధానాల వల్ల ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని ఈ విద్య వ్యతిరేక విధానాలకు తిప్పి కొట్టే విధంగా పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సమీర్, అబ్దుల్ ఖాదర్, దస్తగిరి, వలి,శంకర్,బాబు, రవి, వీరేష్, సంతోష్, విష్ణు, సూరి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయండి. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

విభారే న్యూస్ కర్నూలు ఆగస్టు 12:- జిల్లాలో హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను (గోడ పత్రికలను) జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రచార కార్యక్రమం అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆగష్టు 12 వ తారీఖున ప్రారంభిస్తున్నారన్నారు. 8 వారాల పాటు నిర్వహించే ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా యువత, మహిళలతో పాటుగా, హెచ్.ఐ.వి సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉన్న ఇతర గ్రూపుల వారికి హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ మరియు సుఖవ్యాధులు సంక్రమించే మార్గాలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, పరీక్షా మరియు చికిత్సా కేంద్రాలు వంటి వివరాలు తెలియచేయటం జరుగుతుందని తెలిపారు. హెచ్.ఐ.వి. సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా దగ్గర లోని హెచ్.ఐ.వి. కౌన్సెలింగ్ మరియు పరీక్షా (ఐసిటిసి) కేంద్రంలో సంప్రదించాలని లేదా జాతీయ ఎయిడ్స్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. అలాగే హెచ్.ఐ.వి. తో జీవిస్తున్న వారిని ఆదరించాలని, వారిపట్ల ఎటువంటి వివక్ష చూపరాదని, హెచ్.ఐ.వి. ఉందన్న కారణంతో వ్యక్తుల పట్ల వివక్ష చూపటం హెచ్.ఐ.వి./ ఎయిడ్స్ చట్టం - 2017 ప్రకారం శిక్షార్హమైన నేరమని తెలియచేసారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మహిళా, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ,మెప్మా, విద్యా శాఖ, గ్రామ, సచివాలయ శాఖ సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రచార కార్యక్రమానికి సంబంధించిన వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (ఈంఅ) డాక్టర్ భాస్కర్ కలెక్టర్ గారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హేమలత, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకట రత్నం, నేస్తం పాజిటివ్ నెట్వర్క్ అధ్యక్షురాలు సుధారాణి, షేర్ ఇండియా ప్రోగ్రాం ఆఫీసర్ రాజ్ కుమార్, లింక్ వర్కర్ స్కీమ్ ఆఖీఖ నాగరాజు, ఎఓఓ ప్రాజెక్టు మేనేజర్ శివ కుమార్, గాఖీఇఆ ప్రాజెక్టు మేనేజర్ మునీర్ అహమ్మద్, ఎఊూ రీజనల్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరమ్మ, జఖీఉ కేర్ సంస్థ కో-ఆర్డినేటర్ ప్రసాద్, లింక్ వర్కర్ స్కీమ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## జి ఒ 117 రద్దు చేయాలి..- కె ప్రకాష్ రావు రాష్ట్ర ఫాప్టో కో చైర్మన్..

కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 12 విభారె న్యూస్...రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ పిలుపుమేరకు రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ కే ప్రకాష్ రావు నాయకత్వంలో కర్నూల్ రూరల్ మండలం మండల విద్యాధికారి కి మరియు అర్బన్ మండల విద్యాధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఇందులో 1) జీవో 117,128 ద్వారా కాకుండా 220 లో విడుదల చేసిన జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలి. 2) పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్ కు వెల్డింగ్ అవకాశము కల్పించాలి. 3) పని సర్దుబాటు ప్రక్రియ మండల డివిజన్ సాయి వరకే పరిమితం చేయాలి. 4) సమాంతర పాఠశాలలో ఉర్దూ తెలుగు తదితర పోస్టులను వర్కర్స్మెంట్ మినహించాలి. 5) పని సర్దుబాటు చేయనప్పుడు ఉపాధ్యాయిని సొంత మేనేజ్మెంట్లో గల ఖాళీలలో భర్తీ చేసిన తర్వాతనే ఇతర మేనేజ్మెంట్లో నియమించాలి. 6) 6 నుండి 10 తరగతులు పది సెక్షన్లు దాటిన సందర్భంలో రెండవ హిందీ రెండవ పిఎస్ పోస్టులను కేటాయించాలి. 7) అవసరాన్ని బట్టి మాత్రమే మిగులు నిర్ణయించి సర్దుబాటు ప్రక్రియ చేయాలి. ఇంకను అనేక తప్పిదాలు ఉన్నందున సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేసి అన్నింటిని సవరించి తర్వాత సర్దుబాటు చేయగలరని రెప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. లేని పక్షంలో ఈ సర్దుబాటు కార్యక్రమం బహిష్కరిస్తామని తెలియ చేసారు.ఈ కార్యక్రమం లో స్ టి యు రాష్ట్ర నాయకుడు సుదీర్,కర్నూలు జిల్లా ఆప్టా ప్రధాన కార్యదర్శి సేవాలల్ నాయక్, శ్రీనివాస రెడ్డి ఎ పి టి ఎఫ్, జయరాజు యూటీఎఫ్ , సర్వేశ్వర రెడ్డి యు టి ఎఫ్, ఇబ్రహీం యు టి ఎఫ్, రామనాయక్ ఎం టి ఎఫ్ లక్ష్మా నాయక్ ఆప్టా,రాముడు ఎస్ టి యు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనటం జరిగింది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190